క్లుప్తంగా

వీరాంజనేయ స్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు జరిగాయి. ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకుపూజ, అష్టోత్తర పూజలు నిర్వహించారు.

డీలర్లకు ఈ-పోస్ మెషీన్ల పంపిణీ



మెషీన్లు తీసుకెళ్తున్న డీలర్లు

పొదలకూరు: రేషన్ షాపుల డీలర్లకు పొదలకూరు రైతు బజారు వద్ద కొత్త ఈ-పోస్ మెషీన్లను మంగళవారం అందజేశారు. పొదలకూరు, రాపూరు, సైదాపురం, చేజర్ల, కలువాయి మండలాలకు చెందిన డీలర్లు పాతవి తీసుకురాగా అప్‌డేట్ అయిన కొత్త యంత్రాలను అధికారులు పంపిణీ చేశారు.

ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం



కోవూరు: ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని గుమ్మళ్లదిబ్బలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొడుగులను చేతబట్టి ఆకారంగా విద్యార్థులు ఏర్పడ్డారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన



నార్తురాజుపాలెంలో..

కొడవలూరు: భూసార పరీక్షల ఆవశ్యకతపై నార్తురాజుపాలెంలోని జెడ్పీ హైస్కూల్ 9, 10వ తరగతుల విద్యార్థులకు అవగాహనను జిల్లా వనరుల కేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. భూసార పరిరక్షణ, భూసార పరీక్షల ఉపయోగాలను జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ దేవసేనమ్మ తెలియజేశారు. కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అనూష, భూసార పరీక్ష కేంద్ర ఏఓ కల్యాణి, ఏఓ విజయలక్ష్మి, హెచ్ఎం ఓబులేసు, సైన్స్ ఉపాధ్యాయుడు తిరుపాలయ్య, వీఏఏ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

- విడవలూరు: భూసార పరీక్షలపై విద్యార్థులు



వావిళ్లలో..

అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ దేవసేన పేర్కొన్నారు. భూసార పరీక్షలపై మండలంలోని వావిళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త అనూష, నెల్లూరు భూసార పరీక్ష కేంద్ర అధికారి కల్యాణి, మండల వ్యవసాయాధికారి లక్ష్మి, వీఏఏలు అరుణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చిత్తశుద్ధితో పనిచేయండి



మాట్లాడుతున్న హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధుల నివారణకు సబ్ సెంటర్ల అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. జిల్లాలోని ఆరోగ్య సబ్ సెంటర్ల అధికారులతో నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో గల తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రక్త పరీక్షల సంఖ్యను పెంచాలని కోరారు. ఖాళీగా ఉన్న నీటి గుంతలను గుర్తించి వాటిల్లో గంబూసియా చేపలను వదలాలని సూచించారు. ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాలను విస్తృతం చేయాలని పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక.. కసుమూరు దర్గా

- రేపట్నుంచి 248వ గంధమహోత్సవాలు
- ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు



కసుమూరు దర్గా ముఖద్వారం

వెంకటాచలం: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే కసుమూరు మస్తాన్‌వలీ (హజరత్ సయ్యద్ కరీముల్లా షా ఖాద్రి ఉరఫ్ కాలేషా పీర్ మస్తాన్‌వలీ రహమతుల్లా అలైహి) దర్గా 248వ గంధం మహోత్సవాలు గురువారం నుంచి కసుమూరులో వైభవంగా జరగనున్నాయి. వీటికి దేశ నలుమూలల నుంచే కాక విదేశాల నుంచి భక్తులు వస్తారు. కొన్ని సంవత్సరాల నుంచి ఏటా జరిగే గంధ మహోత్సవానికి ప్రముఖులు హాజరవుతున్నారు. హిందూ, ముస్లింలు ఆరాధ్య దైవంగా భావించే మస్తానవలీ దర్గా దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందింది.

గంధమహోత్సవాలు జరిగేదిలా..

గురువారం రాత్రి 12 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. కసుమూరు దర్గాకు కిలోమీటరు దూరంలో ఉన్న చందన్‌మహల్ నుంచి గుర్రంపై గంధంను ఊరేగింపుగా శుక్రవారం ఉదయం 6 గంటలకు దర్గా వద్దకు తీసుకొస్తారు. కడప పీఠాధిపతి ఆరీఫుల్లా చదివింపులు చేసి గంధ లేపనం అనంతరం భక్తులకు పంపిణీ చేస్తారు. శనివారం ఉదయం 10 గంటలకు తహలీల్, ఫాతేహా కార్యక్రమాలు నిర్వహిస్తారు. గంధ మహోత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు హాజరుకానుండటంతో ఏర్పాట్లపై వక్ఫ్ బోర్డు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని వక్ఫ్ బోర్డు, పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్‌పై దృష్టి సారించాలన్నారు.



గంధ మహోత్సవం ప్రారంభించే చందన్‌మహల్

ఏర్పాట్లు చేస్తున్నాం

కసుమూరు మస్తాన్‌వలీ దర్గా గంధ మహోత్సవాలకు వేలాది మంది భక్తులు తరలి రానున్నారు. వీటిని విజయవంతంగా ముగించేందుకు అన్ని శాఖల అధికారులతో కలిసి పనిచేస్తాం. రూ.16 లక్షలతో విద్యుద్దీపాలంకరణ, భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఖుదావస్, జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో ఫెడరేషన్ బాధ్యులు



రగ్బీ ఆడుతూ..

పొదలకూరు: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపికల్ని మంగళవారం స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. అండర్ – 14, 17, 19 విభాగంలో ప్రతిభ చూపిన బాలబాలికలను కమిటీ ఎంపిక చేసింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సురేష్, శైలజ, గేమ్స్ సెక్రటరీ దేవిక, బీవీ రమణయ్య పర్యవేక్షించారు. రగ్బీ పోటీలను రమేష్, శ్రీధర్, హరిప్రసాద్ నిర్వహించారు.

బాక్సింగ్, జూడో పోటీలకు గురుకుల విద్యార్థులు

ఇందుకూరుపేట: రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో బాక్సింగ్, జూడో జిల్లా జట్లకు ఇందుకూరుపేటలోని రాష్ట్ర గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు జనార్దన్ రావు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని అభినందించారు. అండర్ – 14 బాక్సింగ్‌లో మానికల సుశాంత్, చందు, రోహిత్, అండర్ – 17లో హర్షవర్ధన్, భరత్.. జూడో అండర్ – 14కు అంజనాద్రి, సుశాంత్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటకృష్ణకు అభినందనలను తెలియజేశారు.



విద్యార్థులకు అభినందన

మండల సర్వసభ్య సమావేశం

ఇందుకూరుపేట: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ పెంచలశ్యామ్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గంధళ్ల శంకరయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తమ పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు.. ప్రస్తుత స్థితిని అధికారులు వివరించారు. డీటీ గోపీకృష్ణ, మండల ఉపాధ్యక్షులు లావణ్య, మమత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెంచలశ్యామ్

మర్యాదపూర్వకంగా..



కోవూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, పార్టీ యువజన విభాగ కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో పార్టీ వలంటీర్ల విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, మైనార్టీ విభాగ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మౌలాలీ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలను తెలియజేశారు. పార్టీ కోవూరు మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, పడుగుపాడు ఉప సర్పంచ్ అహ్మద్, పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా కార్యదర్శి గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, పార్టీ యువజన విభాగ కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డిని పార్టీ సోషల్ మీడియా విభాగ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తన్నీరు ఆదిశేషయ్య కలిశారు. మొక్కను అందజేసి కృతజ్ఞతలను తెలియజేశారు. నేతలు కనిసిరి వెంకయ్య, మధు, మస్తాన్, మణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

కోవూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2.0 సిస్టమ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్టాంపు వెండార్ల అసోసియేషన్ నేతలు కోరారు. డాక్యుమెంట్ రైటర్లు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం రెండో రోజు మంగళవారం కొనసాగింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బోసిపోయింది. రాష్ట్రవ్యాప్త ఆందోళనలను చేపట్టేందుకు సిద్ధమని వారు స్పష్టం చేశారు.

- బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రిజిస్ట్రేషన్లలో ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని డాక్యుమెంట్ రైటర్లు డిమాండ్ చేశారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పెన్‌డౌన్ కార్యక్రమాన్ని వారు చేపట్టారు. పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు.



కోవూరు: మాట్లాడుతున్న డాక్యుమెంట్ రైటర్లు

పేకాట స్థావరంపై దాడులు

- ఏడుగురి అరెస్ట్

పొదలకూరు: మండలంలోని వావింటపర్తి పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై కండలేరు మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఏడుగురిని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.3,160లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ జట్ల ఎంపికలు

కొడవలూరు: స్కూల్ గేమ్స్ అండర్ – 14, 17 మండల స్థాయి జట్ల ఎంపికలను బుధ, గురువారాల్లో నిర్వహించనున్నామని ఎంఈఓలు వసంతకుమారి, అంకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ బాలబాలికల జట్లను యల్లాయపాళెంలోని హైస్కూల్లో బుధవారం.. చెస్, యోగా, అథ్లెటిక్స్ బాలబాలికల ఎంపికలను నార్తురాజుపాళెంలోని హైస్కూల్లో గురువారం నిర్వహించనున్నామని చెప్పారు. అండర్ – 14కు 2012, జనవరి ఒకటి తర్వాత.. అండర్ – 17కు 2009, జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ స్కూళ్లతో పాటు యాజమాన్య పాఠశాలల విద్యార్థులు తప్పక హాజరయ్యేలా చూడాలని కోరారు.

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో రక్తదాన శిబిరం నేడు

వెంకటాచలం: దేశ ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ కో–ఆర్డినేటర్ జనార్దనరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

మనుబోలు: మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ముజీబున్నీసా తెలిపారు. మంగళవారం జరగాల్సిన సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు వివరించారు. మండలంలో 13 మంది ఎంపీటీసీ సభ్యులుండగా కేవలం నలుగురు మాత్రమే హాజరవడంతో సమావేశాన్ని వాయిదా వేశామన్నారు. తదుపరి తేదీని త్వరలోనే తెలియజేస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణ తదితరులు

వెంకటాచలం: పరిసరాల పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యమివ్వాలని కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ అన్నారు. మండలంలోని గొలగమూడి వద్దనున్న ఐఐటీటీఎం కళాశాలలో స్వచ్ఛత పఖ్వాడా – 2025 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశానికి 29న, ప్రైవేట్ ఐటీఐల్లో చేరేందుకు కౌన్సెలింగ్‌ను 30న నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

రేపట్నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్

మనుబోలు: ఈనెల 18వ తేదీ నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభమవుతాయని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమూల్య, పీడీ ప్రమీలారాణి తెలిపారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. 18న అథ్లెటిక్స్ విభాగంలో 100, 200, 400, 800 మీటర్ల పరుగుపందేలు జరుగుతాయన్నారు. ఇంకా లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కత్రో, యోగా, చదరంగం పోటీలు ఉంటాయన్నారు. 19న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న హెచ్ఎం, పీడీ

కాకాణిపై పెట్టినవి అక్రమ కేసులే

మనుబోలు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని జట్లకొండూరు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు అన్నారు. మంగళవారం వారు గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉండగా అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని కాకాణిపై పదేపదే ఆరోపణలు చేస్తున్న టీడీపీ నాయకులు విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు. తమ నాయకుడు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక టీడీపీ వారు నోరు పారేసుకోవడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వారు అధికారం, పోలీసుల అండతో చెలరేగిపోతున్నారని చెప్పారు. విమర్శలకు సోమిరెడ్డి నేరుగా సమాధానం చెప్పలేక అనుచరులను ఎగదోయడం సిగ్గుచేటన్నారు. బద్దెపూడి సురేష్, నావూరు సంతోష్, కసుమూరు సునీల్, పరశురామ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ నాయకులు

పలువురికి ప్రసన్న పరామర్శ





కొడవలూరు: మండలంలోని మానేగుంటపాడుకు చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. గ్రామ సర్పంచ్ పొలిచర్ల శ్రీనివాసులురెడ్డి అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందడంతో గ్రామంలోని వారి నివాసానికెళ్లి ఆయన సతీమణి సుదర్శనమ్మను పరామర్శించారు. గ్రామానికి చెందిన ఇందూరు బాలభాస్కర్‌రెడ్డి శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కారెంపూడి సుబ్బరామిరెడ్డి తనయుడు మిథున్‌రెడ్డి ప్రమాదంలో గాయపడి చేతికి శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి, నేతలు అడపాల మోహనకృష్ణ, దేవిరెడ్డి సాయిరెడ్డి, కాకి సుమన్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సర్పంచ్ మోచర్ల రమేష్, డేగా శివప్రసాద్‌రెడ్డి, గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ ఇందూరు రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మెడికల్ క్యాంపులు

మనుబోలు: మండల వ్యాప్తంగా బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ నిర్వహించనున్న మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ గేయ పూజిత కోరారు. మంగళవారం ఆమె స్థానిక పీహెచ్‌సీలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విషజ్వరాలు అధికంగా ఉన్నందున ఉన్నతాధికారుల సూచనలతో క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పూజిత

మానవ ఆరోగ్యంపై కాలుష్య ప్రభావం

- వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం: పర్యావరణ కాలుష్యం మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో మంగళవారం పర్యావరణ కాలుష్యం – ప్రజారోగ్యంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఇందులో వీసీ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కాలుష్యం విపరీతంగా పెరుగుతోందన్నారు. కాలుష్య సమస్యలను ఎదుర్కోవడానికి శాస్త్రీయ పరిశోధనలు, అంతర్జాతీయ సహకారం చాలా అవసరమన్నారు. ఇలాంటి సదస్సుల ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు కలిసి తమ అనుభవాలను పంచుకోవడంతో కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమవుతుందని చెప్పారు. ఇంకా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, ఇతర అధ్యాపకులు మాట్లాడారు.



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

ప్రజలకు అవగాహన కల్పించాలి

ఇందుకూరుపేట: ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన పెంచాలని రాష్ట్ర టీబీ విభాగ జాయింట్ డైరెక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీని మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వస్థ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నుంచి అక్టోబర్ రెండు వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు, శిక్షణ కార్యక్రమాలపై వైద్యాధికారులను ఆరాతీశారు. రక్తదాన శిబిరాల ఆవశ్యకతను తెలియజేయలని కోరారు. తౌలుత రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి కిశోర్‌కుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి సుధాకర్‌రావు, సూపర్‌వైజర్లు రమ, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

పెన్నా పరీవాహక ప్రాంతాల్లో పరిశీలన

కోవూరు: సోమశిల జలాశయం నుంచి 35 వేల క్యూసెక్కులను విడుదల చేయడంతో పెన్నా పరీవాహక ప్రాంతాలను తహసీల్దార్ సుబ్బయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిస్థితిని రెవెన్యూ, పోలీస్ శాఖ, విపత్తు నిర్వహణ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వివరించారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

